Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును

సంప్రదించండి సెల్: 9440352036

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 138 | Saturday : 03.05.2025 | Price : 3/- | Pages : 4

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :138 | శనివారం : 03.05.2025 | వెల : 3 | పేజీలు : 4



### గవర్నర్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపిన

# కాంగ్రెస్ నేతలు


**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టేందుకు కేంద్రం తీసుకున్న నిర్ణయం.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కృషి ఫలితమేనని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఆమోదించి రాష్ట్రపతికి పంపినందుకు కాంగ్రెస్ నేతలు రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి ధన్యవాదాలు తెలియ జేశారు. తెలంగాణ రాష్ట్రం కులగణన చేసి ప్రామాణికంగా స్పష్టమైన లెక్కల్ని వెల్లడించిం దని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ విషయంలో రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎవరెన్ని మాట్లాడినా... కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి వల్లే కేంద్రం జనగణన, కులగణన చేపడుతోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. చౌకబారు విమర్శలు చేసేవారు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. కులగణనను తాము ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్సీ విజయశాంతి, కాంగ్రెస్ సీనియర్ నేతలు వీహెచ్, మధుయాష్కి తదితరులు ఉన్నారు.

### అమరావతి పునఃప్రారంభ పనులకు

# ప్రధాని మోదీ శంకుస్థాపన

- ఈ రోజు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే రోజు..
- రైట్ లీడర్ ఫర్ ది నేషన్
- ప్రధాని మోదీకి అండగా ఉంటాం : చంద్రబాబు
- భారతదేశానికి తలమానికం అమరావతి : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్




**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునఃప్రారంభ పనులకు ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా అమరావతిలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ప్రసంగించిన ప్రధాని మోదీ చాలా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి అని మోదీ అన్నారు. తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ.."అమరావతి స్వప్నం సాకారమవుతోంది. చారిత్రక పరంపర, ప్రగతి రెండూ కలిపి పయనిస్తున్నట్లు కనిపిస్తోంది. ఒక కొత్త అమరావతి, కొత్త ఆంధ్ర ప్రదేశ్ రూపుదాల్చుతోంది. దుర్గాభవానీ కొలువైన ఈ భూమిలో మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది. బౌద్ధ వారసత్వం, ప్రగతి కలగలిపిన ప్రాంతం ఇది. ఇప్పుడు నేను ఈ పుణ్యభూమిపై నిలబడి ఉన్నాను." అని తన ప్రసంగంలో వెల్లడించారు. అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి అని పేర్కొన్న ప్రధాని మోదీ.. "ఆంధ్రప్రదేశ్‌ను అధునాతన ప్రదేశ్‌గా మార్చే శక్తి అమరావతికి ఉంది. ఇవి శంకుస్థాపనలు కాదు.. ఏపీ ప్రగతికి, వికసిత్ భారత్‌కు నిదర్శనం. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి ఇది శుభ సంకేతం. రికార్డు స్పీడ్‌లో అమరావతి నిర్మాణాలు కొనసాగేందుకు కేంద్రం సహకరిస్తుంది. ఏపీలోకి ప్రతి ఒక్కరి కలలను అమరావతి సాకారం చేస్తుంది. చంద్రబాబు.. నా టెక్నాలజీ వాడకం గురించి చెప్పారు. గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు.. ఏపీ సీఎంగా చంద్రబాబు టెక్నాలజీ వాడకాన్ని నేను గమనించాను. చంద్రబాబును చూసి నేర్చుకొన్నా." ప్రధాని మోదీ అన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి ఇది శుభ సంకేత మన్న ప్రధాని మోదీ.. "రికార్డు స్పీడ్‌లో అమరావతి నిర్మాణాలు కొనసాగేందుకు కేంద్రం సహకరిస్తుంది. ఏపీలోకి ప్రతి ఒక్కరి కలలను అమరావతి సాకారం చేస్తుంది. రాజధాని అమరావతి ఏపీ ఆశలు, వికసిత్ భారత్ ఆశలు.. స్వర్ణాంధ్రకు బీజం. ఏపీని అధునాతన రాష్ట్రంగా మార్చబోతోంది అమరావతి. అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి." అని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించడం విశేషం.. "అమరావతి స్వప్నం సాకారమవుతున్నట్లు కనిపిస్తోంది. చారిత్రక పరంపర, ప్రగతి రెండూ కలిపి పయనిస్తున్నట్లు గోచరిస్తోంది. ఒక కొత్త అమరావతి, కొత్త ఆంధ్రప్రదేశ్. దుర్గాభవానీ కొలువైన ఈ భూమిలో మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది. బౌద్ధ వారసత్వం, - మిగతా3లో




## ప్రపంచానికి ఇదే సందేశం ఇచ్చాం

- దేశ భద్రత విషయంలో మొత్తం విపక్షం కేంద్రానికి మద్దతుగా నిలుస్తుంది
- మోదీ ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన నిర్వహించాలని నిర్ణయించింది.
- పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతిగా ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన వ్యూహం కనిపించలేదు
- రాహుల్ గాంధీ కాన్పూర్‌లో చనిపోయిన శుభం ద్వివేదీ కుటుంబాన్ని కలిశారు.
- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

### అవినీతి మరకలను

# నిరూపిస్తే దేనికైనా సిద్ధం



- 'ఇలంబర్తికి వచ్చింది ప్రమోషన్.. డిమోషన్ కాదు'
- నా పరిధిలో ఉన్న అన్నింటిలో విచారణ చేసుకోండి
- మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్
- అధికారుల బదిలీ సర్వ సాధారణం

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

తన పరిధిలో ఉన్న శాఖల్లో అవినీతి జరిగిందంటూ వచ్చిన ఆరోపణలను మంత్రి పొన్నం ప్రభాకర్ ఖండించారు. దీనికి సంబంధించి తన పరిధిలోని అన్ని డిపార్ట్ మెంట్లలో విచారణ చేసుకోవచ్చని సవాల్ చేశారు. మీడియాతో చిట్ చాట్ చేసిన పొన్నం తనపై వచ్చిన అవినీతి ఆరోపణలపై స్పందించారు. చిన్న స్థాయి నుంచి మంత్రిగా ఎదిగానని, తనపై వచ్చిన అవినీతి మరకలను నిరూపిస్తే తాను దేనికైనా సిద్ధమేనన్నారు. తప్పుడు ప్రచారాన్ని సహించేది లేదని, తన దగ్గరున్న ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి కింది స్థాయి అధికారి వరకూ మంచి - మిగతా3లో

### వైసీపీ ప్రక్షాళన దిశగా

# అడుగులు

- సరికొత్త వ్యూహాలకు పదును పెడుతూ పార్టీని ముందుకు నడిపించాలని జగన్ డిసైడ్ అయ్యారట
- ఇప్పటివరకు ఒక లెక్క..ఇప్పుడు ఒక లెక్క అన్నట్లుగా జగన్ పార్టీలో కీలక సంస్కరణలను చేపట్టబోతున్నారని పార్టీవర్గాల్లో టాక్
- వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో జగన్ అడుగులు ముందుకు వేస్తున్నారని ఫ్యాన్ పార్టీలో చర్చ




**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, విజయవాడ**

వైసీపీని ప్రక్షాళన చేసే పనిలో ఆపార్టీ అధినేత జగన్ తలమునకలయ్యారట. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో జగన్ అడుగులు ముందుకు వేస్తున్నారని ఫ్యాన్ పార్టీలో చర్చ నడుస్తోంది. సరికొత్త వ్యూహాలకు పదును పెడుతూ పార్టీని ముందుకు నడిపించాలని జగన్ డిసైడ్ అయ్యారట. ఇప్పటివరకు ఒక లెక్క..ఇప్పుడు ఒక లెక్క అన్నట్లుగా జగన్ పార్టీలో కీలక సంస్కరణలను చేపట్టబోతున్నారని పార్టీవర్గాల్లో టాక్ విన్పిస్తోంది. ఇకనుంచి పార్టీలో వికేంద్రీకరణ విధానం తీసుకురావాలని చూస్తున్నారట.వైసీపీలో దిగువ స్థాయి నుంచే పార్టీ ఎదగాలని వారే బాధ్యులుగా మారి సమర్థంగా పనిచేయాలని ఆయన గట్టిగా కోరుకుంటున్నారు. అందుకే మొన్నటి - మిగతా3లో



### సిక్కు ఆర్మీ సైనికులకు

# రెచ్చగొట్టేలా..

- ఖలిస్థానీ ఉగ్రవాది పన్నూన్ సందేశం
- పాకిస్తాన్‌తో భారత్ యుద్ధం చేస్తే సిక్కు సైనికులు పోరాడవద్దని
- సిక్కులకు, ఖలిస్థాన్‌కు పాకిస్థాన్ 'స్నేహపూర్వక' దేశం
- 'భారతదేశం పాకిస్థాన్‌పై దాడి చేస్తే, అది భారతదేశానికి, ప్రధాని మోదీకి చివరి యుద్ధం అవుతుంది

### గ్రూప్-1 నియామకాలపై

# స్టే కొనసాగింపు

- జూన్ 11కి విచారణ వాయిదా!
- ఈ నెల 17న నియామకాల ప్రక్రియను నిలిపివేయాలి
- వెకేషన్‌లోగా స్టేపై నిర్ణయం తీసుకోవాలని డివిజన్ బెంచ్ చెప్పింది

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

రాష్ట్రంలో గ్రూప్-1 నియామకాలను తాతాలికంగా నిలిపివేస్తూ ఏప్రిల్ 17న జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు పొడిగించింది. గ్రూప్-1 మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయంటూ ఎం. పరమేశ్ మరో 20 మంది అభ్యర్థులు దాఖలు చేసిన కేసులో న్యాయమూర్తి జస్టిస్






## కమ్ముకున్న యుద్ధ మేఘాలు

- పాక్‌కు వెయ్యి కిలోమీటర్ల దూరంలో భారత్ ఫైటర్ జెట్‌లు
- ఇండియన్ ఎయిర్ ఫోర్స్ విన్యాసాలు చేస్తున్నయుద్ధ విమానాల్లో రాఫెల్, మిగ్-29, మిరాజ్ 2000 ఉన్నాయి
- అందుబాటులోకి రాత్రి వేళ్లల్లో ల్యాండ్ చేసేలా యుద్ధ విమానాలు

## రెండు నెలలు ఆహారం నిల్వ చేసుకోండి

- పౌరులను కోరిన పీఓకే
- లోకల్ అసెంబ్లీని ఉద్దేశించి పీఓకే ప్రధానమంత్రి చౌదరి అన్వర్ అల్ హక్
- ఎల్ఓసీ వెంబడి 13 నియోజకవర్గాల్లో రెండు నెలల పాటు ఆహార పదార్థాలు నిల్వ చేసుకోవాలి



### అంగరంగ వైభవంగా

## కల్వరి మౌంట్ ఫ్యామిలీ ఫెస్టివల్ మహోత్సవం



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, మే 02:**

ఎస్ఆర్ పురం మండలం చిన్న ఉయ్యూరు కల్వరి మౌంట్ ఫ్యామిలీ ఫెస్టివల్ శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభించారు కల్వరి మౌంట్‌లో డీఎస్ సౌందర్ పాండియన్ శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు శనివారం వేలూరు డయాసిస్ బిషప్ కల్వరి మౌంట్ ఉత్సవంలో పాల్గొంటారు అలాగే శనివారం మధ్యాహ్నం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్ జీడి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పాల్గొంటారు కల్వరి మౌంట్ ఫ్యామిలీ ఫెస్టివల్ మహోత్సవం సందర్భంగా శనివారంఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రత్యేక ప్రార్ధ నలు ఏసుక్రీస్తు పాటలు నిర్వహిస్తారు. ఈ కల్వరి మౌంట్ ఫ్యామిలీ ఫెస్టివల్‌కు సుమారు 5000 మంది క్రైస్తవ క్రైస్తవులు పాల్గొంటారు. ఉదయం టిఫిన్ మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు ఈ కార్యక్రమంలో డీఎస్ సౌందర్య పండియన్ పాస్టర్ మాథ్యూ, పాస్టర్ అన్బుదాస్, ఏసుమణి, వినయ్, జాన్ సాల్మన్ యేసు రత్నం సతీష్ సురేష్ యాకోబ్ పరదేశి ఉపదేశకులు పాల్గొన్నారు.

## చవటకుంట మహాభారత ఉత్సవాలలో యజ్ఞాపూజ

### నరసింహారెడ్డి కుమారుడు, గోపి, కుటుంబ సభ్యులు



**వెదురుకుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మే02:**

వెదురు కుప్పంమండలంలోని చవటకుంట మహాభారత ఉత్సవాలలో శుక్రవారం యజ్ఞా పూజ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని పాలకుంట చేను గ్రామానికి చెందిన రిటైర్డ్ విశ్రాంతి ఉద్యోగి నరసింహారెడ్డి కుమారుడు, గోపి కుటుంబ సభ్యులు ఉబయ దారులుగా వ్యవహరించారు. వారికి ఆలయఅర్చక స్వాములు తీర్థప్రసాదాలను అందించి, అమ్మవారి దర్శనభాగ్యాన్ని కల్పించారు. ఆశీర్వచనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## త్రాగునీరు సమస్య తీర్చిన జిల్లా పరిషత్ చైర్మన్

**వీ.కోట,చిత్తూరు ఎక్స్‌ప్రెస్, మే 02:**




వీకోట మండలం కొంగాటం పంచాయతీ గందారమాకనపల్లి గ్రామంలో త్రాగునీటి సమస్య తెలుసుకున్న చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ జి శ్రీనివాసులు వెంటనే స్పందించి త్రాగునీటి బోరు వేయడానికి జడ్పీ నిధుల నుండి మంజూరు చేసి ఆ గ్రామములో వెంటనే బోరు బావి త్రవ్వించి మోటారు పైపులు తదితరాలు యుద్ధ ప్రాతిపదికన సమకూర్చి గ్రామానికి నీటి కొరత తీర్చినారు. గ్రామంలో త్రాగునీటి బోరు మోటారులు చైర్మన్ తనయుడు నరేంద్ర మరియు ఎంపీటీసీ కమల్ నాథ్ వార్డు మెంబర్ మరియు గ్రామస్తులు సమక్షంలో మోటార్ స్విచ్ ఆన్ చేసి త్రాగునీరు గ్రామానికి అందించినారు. ఈ సందర్భంగా గ్రామస్తులు జిల్లా పరిషత్ చైర్మన్ జి. శ్రీనివాసులకు కృతజ్ఞతలు తెలియజేసినారు.

### కిషోరి బాలికా వికాసంపై

## మహిళలకు అవగాహన

### సిడిపిఓ అరుణ కుమారి

**వి.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మే 02:**



వీకోట మండలం ప్రభుత్వం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కిషోరి బాలికా వికాసం కార్యక్రమం ద్వారా మహిళలు వారి హక్కులను రక్షించుకోవడం పట్ల అవగాహన కల్పించుకోవాలని బైరెడ్డిపల్లి సిడిపిఓ అరుణకుమారి తెలిపారు. మండల కేంద్రమైన వి కోటలోని వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో వీకోట మేజర్ పంచాయతీ సర్పంచ్ శ్రీమతి పిఎన్ లక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసి సమావేశానికి విచ్చేసి ప్రసంగించారు. మండల స్థాయిలో అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, సచివాలయం సిబ్బందికి గతంలో కల్పించిన శిక్షణలో వారి హక్కులను తెలుసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది బాల్యవివాహాల నిర్వహణ నిరోధక చట్టం, టీనేజ్ ప్రెగ్నెన్సీ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మహిళల ఆరోగ్యం ,పోషణ రుతుక్రమంలో పాటించాల్సిన శుభ్రత తదితర అంశాలను తెలియజేశారు. సమాజంలో బాలికలను రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సర్పంచ్ పి యన్ లక్ష్మి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని మహిళా పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

# మానవ వికాసానికి చదువు - క్రీడలు బొమ్మ బొరుసు లాంటివి.

## ఉచిత వేసవి బడులు పేద చిన్నారుల జీవితానికి వెలుగులు. : హిందూపురం డియస్పి మహేష్ వెల్లడి.







**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, మే 02:**

పిల్లల విద్యాభివృద్ధికి మానవ వికాసానికి చదువుతో పాటు క్రీడలు బొమ్మ బొరుసు లాంటివని, మార్గదర్శి విద్యానికేతన్ ఉచిత వేసవి బడులు పేద చిన్నారుల జీవితానికి వెలుగులు నింపుతాయని హిందూపురం డిఎస్పీ కె.వి. మహేష్ పేర్కొన్నారు. గురువారం శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలోని త్యాగరాజనగర్‌లో వున్న మార్గదర్శి విద్యానికేతన్ నిర్వాహకులు కె.సాయికళ – కె మాళప్ప దంపతుల ఆద్వర్యములో శ్రీ వెంకటేశ్వర మిల్క్ డైరీ వ్యవస్థాపకులు కె.అరుణ సీవి నాగరాజు సౌజన్యంతో ఏర్పాటు చేసిన 27వ సం.పు ఉచిత వేసవి బడుల ప్రారంభోత్సావమునకు డిఎస్పీ మహేష్, వన్‌టౌన్ సీఐ రాజగోపాల నాయుడు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వల గావించి ఉచిత వేసవి బడిని లాంచనంగా ప్రారంభించారు. అనంతరం చిన్నారులకు డిఎస్పీ, సిఐ చేతుల మీదుగా అక్షరాభ్యాసం గావించారు. అనంతరము జరిగిన సభలో డిఎస్పీ మహేష్ మట్లాడుతూ చిన్నారులను పాఠశాలలో చేర్చే మునుపు క్రీడా మైదానాలు వున్నాయా? లేవా? అని పరిశీలన చేసిన తర్వాత ప్రవేశాలు చేయలని, చదువుతో పాటు క్రీడలలో కూడ రాణించాలని అభిప్రాయపడ్డారు. సిఐ రాజగోపాల్ నాయుడు మాట్లాడుతూ విద్యా వికాసానికి ఉచిత వేసవి బడులు చిన్నారులకు ఓవరంగా ఉపయోగ పడుతున్నాయన్నారు. విద్యార్థలు సెల్ ఫోన్‌లకు దూరంగా వుంచి వారి సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. ముద్దిరెడ్డిపల్లి ఎసియన్ సిల్క్స్ అధినేతలు లక్ష్మీదేవి ఏసి నాగ రాజు విద్యార్థులకు తీపి వంటకాలతో కూడిన భోజనాలు అందించారు. డిఎస్పీ మహేష్, సిఐ రాజగోపాల్ నాయుడుల ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ అంజప్ప, అధ్యాపకులు యాంకర్ దయానంద్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు యం.సి. గంగాధర్, డ్రాయింగ్ మాస్టర్ శ్రీశైలం, సాఫ్ట్ వేర్ ఇంజనీర్ శ్రీధర్ గౌడ్, ఆర్మి చలపతి, మంచుమెలోడీస్ సింగర్ గాజుల శ్రీనివాసులు, ఆర్‌వి మెలోడీస్ రాజు బృందం, సాయి రామాచంద్ర, మమత, శిరి, సాయి అరవింద్, డ్రాపౌట్ చిన్నారులు, వారి తల్లిదండ్రులు పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి పరుగు ప్రారంభించింది

### డా.యం.ఉమేష్ రావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, మే 02:**

శ్రీకాళహస్తి విధ్వంసకారుడు జగన్‌రెడ్డి తుగ్లక్ నిర్ణయాలతో ఐదు సంవత్సరాల పాటు అజ్ఞాతవాసం గడిపిన ఆంధ్రుల కలల రాజధాని,ప్రజా రాజధాని నేడు మళ్ళీ ప్రధాని చేతుల మీదుగా పునః ప్రాణప్రతిష్ఠ చేసుకున్న అమరావతి పరుగు ప్రారంభించిందని తెలుగుదేశం పార్టీ, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్య దర్శి డా.యం.ఉమేష్ రావు హర్షంవ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా ఆంధ్రుల కలల రాజధాని అమరావతి పనుల పునః ప్రారంభోత్సవ కార్యక్రమం ప్రజల సమక్షంలో ఘనంగా నిర్వ హించడం జరిగిందని, ఇది అన్ని ప్రాంతాలకు, వర్గాలకు, మతాలకు, కులాలకు సంబం ధించిన ప్రజా రాజధానిగా ఘనత సాధి స్తుందని హర్షం వ్యక్తం చేశారు. అమరావతి అజరామరం అని, ప్రజల త్యాగాలకు ప్రతిరూపం అని, అటు వంటి ప్రజా రాజధానిని ఎవరో వచ్చి ఆపడానికి, పీకడానికి అమరావతి అనేది ఇంట్లో పెంచు కున్న పెరటి మొక్క కాదని, జనం గుండెల్లో దాచుకున్న ప్రజారాజధాని అని కొనియాడారు.అమరావతిని ఎద్యు కేషన్ హబ్‌గా తీర్చిదిద్ది, ఇక్కడ కనీసం 5 లక్షల మంది పిల్లలు చదువుకునేఅవకాశం కలిగించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసి, వాటన్నిటినీ రాబోయే మూడుసంవత్సరాలలో సాక్షాత్కారం చేయబోతున్నట్లు చంద్రబాబు నాయుడు ప్రకటించడం శభ పరిణామం అని కొనియాడారు. నాఅనుభవంతో చెప్తున్నా, ఈ దేశంలో పెద్ద పెద్ద ప్రాజెక్ట్‌లు చేయలన్నా, వేగంగా చేయలన్నా, క్వాలిటీతో చేయలన్నా చంద్రబాబుని మించివారు లేరని, అమరావతి నిర్మాణం కూడా అద్భుతంగా, శరవేగంగా నిర్మాణం పూర్తి చేసుకుంటుందని నరేంద్ర మోడీ కొనియాడారు. చంద్రబాబునాయుడు అపార అనుభవంతో అమరావతిని దేశానికే తలమానికంగా, అద్భుతమైన మహానగరంగా తీర్చిదిద్దుతారన్న నమ్మకం ఉందని డిప్యూటీ సియం పవన్ కళ్యాణ్ గారు పేర్కొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్నియకుల క్షత్రియ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యని ర్వాహక కార్యదర్శి డా.యం. ఉమేష్ రావు, శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ముని రాజా యాదవ్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, పద్మశాలి సాధికార సమితి తిరుపతి పార్లమెంటు నాయకుడు చింత గింజల సునీల్, బిసి విభాగం నాయకులు భాస్కర్, రామ చంద్రయ్య, కృష్ణమూర్తి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

### ప్రధానమంత్రి అమరావతి బహిరంగ సభకు

# తరలి వెళ్లిన నాయకులు



**వెదరుకుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, మే 02:**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి అమరావతి బహిరంగ సభకు తరలి వెళ్లిన వెదరుకుప్పం నాయకులు ఈ కార్యక్రమంలో మండల తాహసిల్దార్ బాబు, వెదురుకుప్పం టిడిపి క్లస్టర్ ఇన్చార్జి మోహన్ మురళి, గంటావారిపల్లి సర్పంచ్ శ్రీనాథ్ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, కుమార్, నవీన్, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

## కిషోర్ వికాసం పై బాలికలకు అవగాహన కార్యక్రమం

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మే 02:**



శ్రీకాళహస్తి ఇనగలూరు అంగన్వాడీ కేంద్రంలో కిషోర్ బాలికలకు ఐసిడిఎస్ సూపర్వైజర్ మంజుల ఆధ్వర్యంలో కిషోర్ బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్త వయసు గల బాలికలకు రక్తహీనత ఏర్పడకుండా పౌష్టికా హారం తీసుకోవాలని తెలిపారు. మహిళా పోలీస్ రేణుక మాట్లాడుతూ గ్రామంలో బాలికలు ఒకరికి ఒకరు సరస్పద పరిచయాలు కలిగి ఉండాలని బాలికల భద్రతపై వివరించారు. ఈ కార్యక్రమంలో హరిత అంగనవాడి టీచర్లు బుజ్జమ్మ కుమారి కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సామూహిక ఉపనయన కార్యక్రమం



**పీలేరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, మే 02:**

అన్నమయ్య జిల్లా పీలేరు శ్రీశ్రీశ్రీ జగద్గురు ఆదిశంకరాచార్యుల వారి జయంతి సందర్భంగా ఆర్యవైశ్య కళ్యాణ మండపం, పీలేరు నందు అంగరంగ వైభవముగా జరిగినది. ఉదయం గణపతిపూజ, స్వస్తివాచనం, గణపతి హెూమం, నాందిలు, నవగ్రహపూజ, చవలం, బ్రహ్మప దేశం , భిక్షంబియ్యం తదుపరి నూతనవటువులచే గాయత్రీదేవి, శంకరాచార్యుల చిత్రపటాల ఊరేగింపు కార్యక్రమం జరిగినది. కళ్ళే జయశ్రీ, నరసింహమూర్తి గార్లచే 9మంది నూతన వటువుల దంపతులకు నూతన వస్త్ర, తాంబూలాదులు బహుకరిం చడమైనది. ఈ కార్యక్రమంలో పీలేరు బ్రాహ్మణ సంఘ అధ్యక్ష,ఉపాధ్యక్షులు తెనాలి శేషగిరిరావు, ఉద్యా ఫణీంద్ర శర్మ, తెనాలి రామ సుబ్రహ్మణ్యం, గొల్లాపిన్ని ప్రభాకర్ రావు, నరసింహమూర్తి, జీవీఎస్ ఆర్కే ప్రసాద్, కె వెంకటేశ్వర్లు, వేంపల్లి నరసయ్య, చంద్రా స్వామి, బాలాచార్, విరూపాక్షం కాశీనాథ్, ఉద్యా మయుర్నాథ్, విరూపాక్షం విశ్వనాథ్, పి.మల్లి కార్జున్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎం.వి.ఆర్ డిగ్రీ కాలేజ్‌లో క్యాంపస్ సెలక్షన్స్

### 30 మంది విద్యార్థులు ఉద్యోగానికి ఎంపిక

**గంగవరం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, మే 02:**



పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం శ్రీనగర్ కాలనీలో గల ఎం.వి.ఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన జాబ్ సెలక్షన్స్‌లో బెంగళూరు కు చెందిన ఆల్ డిజిటెక్, క్యూసిఎస్ కంపెనీలకు 30 మంది విద్యార్థులు ఎంపికైనట్లు, కంపెనీ హెచ్ఆర్లు బాబా ఫక్రుద్దీన్, ముక్తియార్‌మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు సోమవారం అనగా మే 05న కంపెనీల్లో రిపోర్ట్ చేయాలని, తెలిపారు అలాగే వీరికి వార్షిక వేతనం2.5లక్షల నుండి 3.10 లక్షలుగా ఉంటుంద ని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ ఎంవిఆర్ రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీ సుధా, అధ్యాపక బృందం అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## గంజేశావళి బాబా 77వ ఉరుసు మహోత్సవం





**గంగావరం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, మే 02:**

పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలంలోని దండపల్లి రోడ్డు నందు గంజేసావలి బాబా దర్గా నందు 77వ ఊరుస్ మహొూత్సవ కార్యక్రమం రెండవ తేదీ అనగా శుక్రవారం రాత్రి గంధం కార్యక్రమం తో మొదలవుతుంది అలాగే శనివారం మరియు ఆదివారం కావాలి నిర్వహిస్తామని దర్గా కమిటీ సభ్యులు సర్వర్ తెలిపారు దైవ కార్యక్రమం ఎన్నో ఏళ్లుగా మతాలకు అతీతంగా నిర్వహిస్తు న్నామని తెలిపారు.ఈ ఊరుస్ మహొూత్స వానికి పలమనేరు నియోజకవర్గం చుట్టు పక్కల ప్రజలందరూ విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు గంజేశావళి బాబా కృప అందరిపై ఉంటుందని తెలిపారు.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
జాతీయ తెలుగు దినపత్రిక
APTEL/2024/86143



# అమరావతి పున:ప్రారంభ పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన

-మొదటిపేజీ తరువాయి

ప్రగతి కలగలిపిన ప్రాంతం ఇది. ఇప్పుడు నేను ఈ పుణ్యభూమిపై నిలబడి ఉన్నాను. అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి. ఆంధ్రప్రదేశ్‌ను అధునాతన ప్రదేశ్‌గా మార్చే శక్తి అమరావతికి ఉంది. అని మోదీ ఆసక్తికర ప్రసంగం చేశారు.

**ఈ రోజు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే రోజు..**

అమరావతి రాజధాని పున:ప్రారంభోత్సవం జరిగిన రోజు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే రోజని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గత ఐదు సంవత్సరాలు రాజధాని పనులు ఆగిపోయాయని, విధ్వంసం జరిగిందని అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని పున:ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ' ఈ రోజు చాలా గొప్ప రోజు. చరిత్రలో శాశ్వతంగా లిఖించదగ్గ రోజు. ఆ రోజు అమరావతి పనులకు ప్రధాని మోదీ గారు శంకుస్థాపన చేశారు. ఐదు సంవత్సరాలు విధ్వంసం జరిగింది. పనులు నిలిచిపోయాయి. మళ్లీ ప్రధాని మోదీ గారే పున:ప్రారంభం చేస్తున్నారంటే.. దీనికంటే మంచి రోజు చరిత్రలో ఇంకోటి లేదని విజ్ఞప్తి చేస్తున్నాను' అని అన్నారు.

**ప్రధాని మోదీకి అండగా ఉంటాం**

ఉగ్రవాదం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ.. ' ముందుగా మీ అందరికీ ఓ విషయం చెప్పాలి. గతంలో మోదీ గారిని ఎప్పుడు కలిసినా.. చాలా ఆహ్లాదకరంగా ఉండేవారు. కానీ, మొన్న అమరావతి కార్యక్రమానికి పిలవడానికి వెళ్లాను. ఆ మీటింగ్ చాలా గంభీరంగా సాగింది. దీనికి కారణం.. ' నా దేశ ప్రజలు ఉగ్రవాదుల దాడిలో చనిపోయారు' అన్న ఆవేదన మోదీ గారిలో చూశాను. ఈ సందర్భంగా మీ అందరి తరపునా ఆయనకు నేనో విజ్ఞప్తి చేస్తున్నాను. ఉగ్రవాదాన్ని అణిచివేయడానికి మోదీ, కేంద్రం తీసుకునే నిర్ణయాలకు మేము అండగా ఉంటాం' స్పష్టం చేశారు.

**రైట్ లీడర్ ఫర్ ది నేషన్**

నరేంద్ర మోదీ నాయకత్వం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ' రైట్ టైం .. రైట్ లీడర్ ఫర్ ది నేషన్.. దట్ ఈజ్.. నరేంద్ర మోదీజీ. చాలా దృఢమైన నాయకుడు.. బ్యాలెన్స్ కలిగిన నాయకుడు. ప్రపంచం నలుమూలలా ఉన్న ప్రజలందరూ మోదీ నాయకత్వాన్ని మెచ్చుకుంటున్నారు. నరేంద్ర మోదీ తన 11 ఏళ్ల పాలనలో ప్రపంచ ఎకానమీలో దేశాన్ని 10 స్థానం నుంచి 5వ స్థానానికి తీసుకువచ్చారు. ఈ సంవత్సరం జపాన్‌ను వెనక్కు నెట్టి 4వ స్థానంలోకి రాబోతోంది'అని అన్నారు.




**భారతదేశానికి తలమానికం అమరావతి**
**: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**

కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ దేశమే తన కుటుంబంగా చేసుకుంటూ దేశాన్ని పాలిస్తున్న నరేంద్రమోదీకి రాష్ట్ర ప్రజల తరపున నమస్కారాలు తెలియచేశారు ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్. ప్రస్తుతం దేశంలో కీలక పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఎంతో బిజీ షెడ్యూల్ మధ్య కూడా ప్రధాని అమరావతికి రావడం చాలా సంతోషకరమని పవన్ అన్నారు. ప్రధాని మోదీకి ఆ కనకదుర్గమ్మ మంచి ఆరోగ్యం, మరిన్ని విజయాలు ప్రసాదించాలని పవన్ దేవతామూర్తిని ప్రార్థించారు. అమరావతి రైతులు, రాష్ట్ర ప్రజలు ధర్మ యుద్ధంలో విజయం సాధించారని పవన్ చెప్పారు. అమరావతి పనులు పు:న ప్రారంభమవుతున్న శుభసందర్భంలో రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు పవన్ ధన్యవాదాలు తెలియచేశారు. గత ఐదేళ్లలో పడిన గాయాలు మనందరికీ గుర్తున్నాయి. ఎన్నో అవమానాలు, గాయాలు అమరావతి రైతులు అనుభవించారని పవన్ అన్నారు.

"గత ఐదేళ్లు అమరావతి రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. లాఠీ దెబ్బలు కూడా తిన్నారు. అమరావతి రైతులు మరిచిపోలేని పోరాటం చేశారు. అమరావతే ఏపీ రాజధానిగా ఉంటుందని ఆనాడు మాట ఇచ్చాం. ఇచ్చిన మాటకు కట్టుబడి మళ్లీ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీతో రాజధాని అమరావతి పనులు పునఃప్రారంభం చేసుకుంటున్నాం. గత ప్రభుత్వం అమరావతి భవిష్యత్‌ను తుడిచిపెట్టేసింది. అయితే, ధర్మయుద్ధంలో అమరావతి రైతులు విజయం సాధించారు" అని పవన్ అన్నారు. అమరావతి రైతుల త్యాగాలు మరిచిపోలేనివని చెప్పిన పవన్.. ఉద్యమంలో అమరావతి మహిళా రైతుల పాత్ర కీలకమన్నారు. అమరావతి రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉందని చెప్పిన పవన్... రాజధాని రైతుల త్యాగాన్ని గత ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. అమరావతి ప్రపంచస్థాయి రాజధానిగా ఆవిర్భవిస్తుందని పవన్ ఆకాంక్షించారు. రాజధాని రైతులు భూములు మాత్రమే ఇవ్వలేదు.. రాష్ట్రానికి ఒక భవిష్యత్ ఇచ్చారని పవన్ కల్యాణ్ కొనియాడారు.రాళ్లు, రప్పల్లో మహానగరాన్ని చూసిన వ్యక్తి చంద్రబాబు అని పవన్ చెప్పారు. సైబరాబాద్‌ను చంద్రబాబు ఎలా సృష్టించారో.. అమరావతిని కూడా అలాగే అభివృద్ధి చేస్తారని పవన్ ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఉగ్రదాడి అనంతరం క్లిష్ట పరిస్థితుల్లో కూడా.. ప్రధాని మోదీ మన కోసం అమరావతికి వచ్చారని పవన్ గుర్తు చేశారు. ఏపీపై మోదీ నిబద్ధతకు ఇదే నిదర్శనమని పవన్ స్పష్టం చేశారు.

# వైసీపీ ప్రక్షాళన దిశగా అడుగులు

-మొదటిపేజీ తరువాయి

పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో చేసిన సూచనలు..నేడు జిల్లా అధ్యక్షులు సమావేశంలో ఇస్తున్న దిశానిర్దేశం రెండింటిని పరిశీలిస్తే..పార్టీని నాయకులకే అప్పగిస్తున్నారన్న టాక్ పార్టీవర్గాల్లో విన్పిస్తోంది.జగన్ అధ్యక్షతన జరిగిన జిల్లా అధ్యక్షుల సమావేశంలో..పార్టీకి జిల్లా అధ్యక్షులే సర్వస్వం అన్నారట. మీరే పార్టీ..పార్టీనే మీరు అని క్లారిటీగా చెప్పేశారు. మీరే అన్ని రకాల బాధ్యతలు తీసుకోవాలని..ఎవరి కోసమో చూడొద్దని సూచించారు. మీకు ఎవరైనా ఆదేశిస్తారేమో అని ఎదురుచూడకుండా సొంత నిర్ణయాలు తీసుకోండి అని జగన్ ఫుల్ ఫ్రీడం ఇచ్చారట. జిల్లా పార్టీకి మీరే యజమానులు..మీ మాటే చెల్లుబాటు అవుతుంది.మీరే మొత్తం జిల్లాలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక ఎంపీ స్థానాన్ని గెలిపించే బాధ్యత తీసుకోవాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల ఇంచార్జ్ తో కలుపుకుని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అసెంబ్లీ పరిధిలో రెండు వర్గాలు ఉంటే వారిని కో ఆర్డినేట్ చేసి సమస్యలను పరిష్కారించుకోవాలని సూచించారని సమాచారం. అంతేకాదు బాగా పనిచేయని




ఇంచార్జిల విషయంలో కూడా ఒకటికి పదిసార్లు పరిశీలన చేసి..ఆ తర్వాత వారు దారికి రాకపోతే మార్చేసే విషయంలోనూ మీదే కీలకపాత్ర అన్నారు.జగన్ ఇంతలా వారి మీదనే ఎందుకు బాధ్యతలు మోపుతున్నారన్న చర్చ పార్టీ నేతల్లో మొదలైందట. పీఏసీ సభ్యులకూ ఇదే విధంగా సూచించారట. అలాగే జిల్లా అధ్యక్షుల విషయంలో ఈ విధంగానే చెబుతున్నారు. దీంతో జగన్ అధికారాలను వికేంద్రీకరించి పార్టీని గ్రాస్ రూట్ లెవెల్ దాకా తీసుకెళ్ళాలని అనుకుంటున్నారా అన్న చర్చ సాగుతోంది. పార్టీ అధినేత జగన్ అన్నీ ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నారని పార్టీ నేతలు చెప్తున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తోంది.ఒకవైపు వైసీపీ ముఖ్య నేతలు వరుసగా అరెస్ట్ అవుతున్నారు. పైనున్న పెద్దలు దాకా కూడా ఈ అరెస్టులు రావచ్చు అన్న చర్చ సైతం పార్టీలో సాగుతోందట. అందుకే జగన్ అన్నీ చూసుకునే పార్టీని సమిష్టిగా నాయకులు అంతా కలసి నడిపే విధంగా ఈ కొత్త రకమైన రూపుని పార్టీకి అందిస్తున్నారని అంటున్నారు. ఏవైనా అనుకోని అవాంతరాలు ఏర్పడినా ఇబ్బందులు లేకుండా పార్టీ ముందుకు సాగాలని జగన్ ఆలోచిస్తున్నారని అంటున్నారు. పార్టీలో గత పరిస్థితులు ఇపుడు లేవని..అందుకే ఈ నిర్ణయం తీసుకున్నారనే గుసగుసలు పార్టీవర్గాల్లో విన్పిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీకి ఎటువంటి ఇబ్బంది వచ్చినా తట్టుకుని నిలబడేలా క్యాడర్ బేస్డ్ గా లీడర్ ఓరియేంటెడ్ గా పార్టీని తీర్చిదిద్దాలని జగన్ చూస్తున్నారని టాక్. మరి ఈ కొత్త రకమైన విధానం సక్సెస్ అయితే ఓకే గానీ, చిక్కల్లా అందరికీ బాధ్యతలు ఇస్తే ఎవరు ఏంచేస్తారో అన్న సందేహం పార్టీ అధినేత జగన్ ను వెంటాడుతోందట. ఏది ఏమైనా వైసీపీ అధినాయకత్వం పార్టీని పటిష్టపరిచేందుకు సరికొత్త ఆలోచనలు చేస్తున్నట్లు పార్టీవర్గాల్లో చర్చ నడుస్తోంది

# ఫోన్ ట్యాపింగ్ కేసు.. ప్రభాకర్ రావుకు హైకోర్టులో చుక్కెదురు

**హైదరాబాద్:** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్‌రావు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ప్రభాకర్‌రావు 30ఏళ్లకు పైగా వివిధ హోదాల్లో విధులు నిర్వహించారని, రాష్ట్రపతి అవార్డును సైతం పొందారని ఆయన తరపు న్యాయవాది కోర్టులో వాదించారు. ఫోన్ ట్యాపింగ్ కేవలం కక్షసాధింపు మాత్రమేనని వాదించారు. కొందరు రాజకీయ నేతలను లక్ష్యంగా చేసుకొని పెట్టిన కేసులో ప్రభాకర్‌రావుని నిందితుడిగా చేర్చారన్నారు. ఫోన్ ట్యాపింగ్ జరగలేదని.. కీలకమైన పరికరాలను ధ్వంసం చేశారనడంలో వాస్తవంలేదని తెలిపారు. 65 ఏళ్ల వయసు ఉన్న ప్రభాకర్‌రావు క్యాన్సర్ చికిత్స కోసం అమెరికాలో ఉన్నారని.. ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తునకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రభాకర్‌రావు ఆదేశంతోనే ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, ఆయనకు బెయిల్ మంజూరు చేయొద్దని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టును కోరారు. పదవీ విరమణ పొందిన తర్వాత అప్పటి ప్రభుత్వ పెద్దల ఆశీస్సుల తో ఓఎస్డీగా కీలకమైన ఎస్ఐబీలో కొనసాగారన్నారు. ప్రధాన నిందితుడైన ప్రభాకర్‌రావును ప్రశ్నిస్తే కీలక సమాచారం వస్తుందని పీపీ వాదించారు. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు ప్రభాకర్‌రావు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది.



## అవినీతి మరకలను నిరూపిస్తే దేనికైనా సిద్ధం

-మొదటిపేజీ తరువాయి

సంబంధాలున్నాయన్నారు. ఇలంబర్తికి తనకు ఎలాంటి విభేదాలు లేవన్నారు. అధికారుల బదిలీలు ప్రభుత్వంలో సర్వసాధారణంగా జరుగుతుందన్నారు. ఇలంబర్తికి వచ్చింది ప్రమోషన్.. డిమోషన్ కాదన్నారు.

## గ్రూప్-1 నియామకాలపై స్టే కొనసాగింపు

-మొదటిపేజీ తరువాయి

రాజేశ్వర్‌రావు ఈ నెల 17న నియామకాల ప్రక్రియను నిలిపివేయాలని ఆదేశాలిచ్చారు. తాజాగా ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాది రచనా రెడ్డి, టీజీపీఎస్సీ తరఫున న్యాయవాది రాజశేఖర్ తమ వాదనలు వినిపించారు. రీకౌంటింగ్‌లో ఓ అభ్యర్థికి 60 మార్కులు తగ్గాయని రచనా రెడ్డి కోర్టుకు తెలపడంతో సదరు అభ్యర్థి పత్రాలు కోర్టుకు సమర్పించాలని టీజీపీఎస్సీని న్యాయమూర్తి ఆదేశించారు. తదుపరి విచారణలో పత్రాలు సమర్పిస్తామని టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది తెలిపారు. వెకేషన్‌లోగా స్టేపై నిర్ణయం తీసుకోవాలని డివిజన్ బెంచ్ చెప్పిందని టీజీపీఎస్సీ కోర్టుకు తెలిపింది. కాగా, విచారణను వేగంగా ముగించలేమని జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు తెలిపారు. వేలాది మందికి సంబంధించిన విషయం కాబట్టి తొందరపడవద్దని, వెంటనే తీర్పు కావాలని ఒత్తిడి చేయవద్దని సూచించారు. తదుపరి విచారణను ధర్మాసనం జూన్ 11వ తేదీకి వాయిదా వేసింది. అప్పటిదాకా మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని వెల్లడించింది.

## నేనింతే!

-మొదటిపేజీ తరువాయి

సరిదిద్దేందుకు ప్రయత్నాలు చేస్తుండటంతో కొందరు మాత్రం హ్యాపీగానే ఉన్నారు. ఇటీవల మీనాక్షి నటరాజన్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. పార్టీలో క్రమశిక్షణ అవసరం అని గుర్తించిన ఆమె ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. అందులో భాగంగా గాంధీభవన్ లో జరిగిన సమావేశానికి నియోజకవర్గాల పరిశీలకుల సమావేశానికి ఆలస్యంగా వచ్చిన వారిపై అప్పటికప్పుడు వేటు వేశారు.వారిని పరిశీలకుల పదవి నుంచి తొలగించారు. ఎమ్మెల్యేలు అని కూడా చూడలేదు. గీత దాటితే వేటు తప్పదంటూ స్ట్రాంగైన హెచ్చరికను పంపగలిగారు. ఈ సమావేశానికి హాజరుకాని అందరు పరిశీలకులను తొలగించి తాను ఇంతే అన్నట్లు మీనాక్షి నటరాజన్ హస్తం పార్టీనేతలకు ఝలక్ ఇచ్చారు.అయితే 2017 నుంచి పార్టీలో ఉన్నవారికే ప్రాధాన్యత ఇవ్వాలని కూడా నిర్ణయించిన మీనాక్షి నటరాజన్ కమిటీలో వారికే చోటు కల్పించాలని భావిస్తున్నారు. మొత్తం మీద మీనాక్షి నాటరాజన్ దెబ్బకు కాంగ్రెస్ నేతలు కంగు తింటున్నారు.

## కాంగ్రెస్ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది: మాజీ మంత్రి హరీశ్‌రావు



జహీరాబాద్: భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణను పూర్తిగా విస్మరించిందని మాజీ మంత్రి, భారాస నేత హరీశ్‌రావు విమర్శించారు. జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు భాజపా నేతలు, కార్యకర్తలు ఆయన సమక్షంలో భారాసలో చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణకు భాజపా అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపైనా విమర్శలు గుప్పించారు. భారాస మొదలుపెట్టిన బసవేశ్వర, సంగమేశ్వర ప్రాజెక్టుల నిర్మాణాలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా పక్కనపెట్టి జహీరాబాద్ నియోజకవర్గానికి అన్యాయం చేసిందన్నారు. ప్రాజెక్టులు పూర్తయితే జిల్లా మొత్తం సాగునీటితో సస్యశ్యామలం అవుతుందని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. "సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులు పూర్తి చేయడానికి భారాస పోరాటం చేస్తుంది. తాగు, సాగునీరు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారాస హయాంలో వచ్చిన నీళ్లు ఇప్పుడు ఎందుకు రావడం లేదు? పాలనా వైఫల్యం, కాంగ్రెస్ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. వాళ్ల మోసం ప్రజలకు తెలిసిపోయింది. మళ్లీ వచ్చేది భారాస ప్రభుత్వమే. తెలంగాణ అభివృద్ధి మాతోనే సాధ్యమవుతుంది" హరీశ్ రావు తెలిపారు

## గొంతెండిపోతోంది!

**హైదరాబాద్ :** రాష్ట్రంలో వేసవి ఎండలు మండిపోతుండటంతో తాగునీటి ఎద్దడి మొదలయ్యింది. వివిధ జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు ఇప్పటికే 40 డిగ్రీలు దాటాయి. రాబోయే నెల రోజుల్లో వేసవి తీవ్రత పెరిగితే ఆ మేరకు తాగునీటి సమస్యలు కూడా మరింత పెరిగే అవకాశం ఉంది. మిషన్ భగీరథ కింద తాగునీటి సరఫరా జరుగుతున్న ప్రాంతాల్లో కూడా ప్రజలు మంచినీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు జిల్లాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. జలశయాలు, చెరువులు లేనిచోట్ల ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోర్ల ద్వారా భగీరథ ఓవర్‌హెడ్ ట్యాంకులకు మంచినీటిని సరఫరా చేస్తారు. అయితే జలాశయాల్లో నీటి మట్టాలు తగ్గడం, చాలాచోట్ల చెరువులు ఎండిపోవడం, భూగర్భ జలాలు ఎండిపోవడంతో సమస్య తలెత్తుతోంది. ప్రస్తు తం ఉమ్మడి నల్లగొండ, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ తదితర జిల్లాల్లోని కొన్ని మారుమూల ప్రాంతాలు, గ్రామాల్లో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్టు సమాచారం.

**ఏజెన్సీ ప్రాంతాల్లో ఇక్కట్లు**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మిషన్ భగీరథ నీరు సరిగా సరఫరా కాక ముఖ్యంగా ఏజెన్సీ మారుమూల ప్రాంతాల్లో ఇబ్బందులు వస్తున్నాయి. ఇంద్రవెల్లి, జైనూర్, లింగాపూర్, సిర్పూర్ యూ మండలాల్లో గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిచోట్ల బోర్లు, ట్యాంకులతో సరఫరా చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం రాజారంలో బోర్ మోటార్ చెడిపోయి నెలలు గడుస్తున్నా మరమ్మతు చేయకపోవడంతో వాటర్ ట్యాంక్‌తో నీటిని సరఫరా చేస్తున్నారు.

**అరకొరగానే భగీరథ నీళ్లు**

నిజామాబాద్ జిల్లాలోని ఇందల్వాయి మండలం, మోపాల్ మండలాల్లో నీటి సమస్య ఉంది. దీంతో గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. మోపాల్ మండలంలోని పలు తండాలు ముంపు గ్రామాలు కావడంతో ఇక్కడ మిషన్ భగీరథ పైపులైన్లు వేయలేదు. బిచ్కుంద మండలంలోని పలు గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. పలు గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎండిపోయాయి. గాంధారి, తాడ్వాయి, లింగంపేట, రామారెడ్డి మండలాల్లోనూ తాగునీటి ఎద్దడి నెలకొంది. మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు.

**సూర్యాపేట మున్సిపాలిటీలో ఇదే పరిస్థితి**

ఉమ్మడి నల్లగొండ జిల్లా సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 48 వార్డుల్లో దాదాపు 17 వేల మిషన్ భగీరథ కనెక్షన్లు ఉన్నాయి. పట్టణంలో రోజు విడిచి రోజు గంట సేపు నీటి సరఫరా చేస్తున్నారు. అవి గృహ అవసరాలకు ఏమాత్రం సరిపోవటం లేదని స్థానికులు చెబుతున్నారు. శివారు ప్రాంతాలైన భాషా నాయక్ తండా, పిల్లలమర్రి బీబీ గూడెం, కాసింపేట, రామకోటి తండా, అంజనాపురి కాలనీల్లోనూ నీటి కొరత ఉంది. కొన్నిచోట్ల భగీరథ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# బిజినెస్

## కాగ్నిజెంట్‌లో 25,000 మంది ఫ్రెషర్ల హైరింగ్




ఈ ఏడాది ప్రాంగణ నియామకాల ద్వారా 20,000 మంది ఫ్రెషర్లను చేర్చుకోనున్నట్లు అమెరికాలోని న్యూజెర్సీ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే రెట్టింపు సంఖ్యలో ఫ్రెషర్లకు ఉద్యోగాలివ్వనున్నట్లు కాగ్నిజెంట్ సీఈఓ రవి కుమార్ ఎస్ వెల్లడించారు. బలమైన మానవ వనరుల వ్యవస్థ నిర్మాణంతో పాటు గడిచిన రెండేళ్లలో పెరిగిన మేనేజ్డ్ సర్వీసెస్ ప్రాజెక్టులు, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్‌కు మద్దతుగా ఫ్రెషర్ల నియామకాలను పెంచాలనుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం కంపెనీ ఫ్రెషర్ల నియామకాలతో పాటు ఏఐ ద్వారా ఉత్పాదకత పెంపు, మానవ వనరులను మరింత మెరుగ్గా వినియోగించుకోవడంపై దృష్టి సారించిందన్నారు. ఈ మార్చి 31 నాటికి కాగ్నిజెంట్‌లో మొత్తం 3,36,300 మంది ఉద్యోగులున్నారు. అందులో 85 శాతానికి పైగా కంపెనీకి చెందిన భారత కార్యాలయాల్లో పనిచేస్తున్నారు. త్రైమాసిక ఆదాయం 510 కోట్ల డాలర్లు: మార్చితో ముగిసిన త్రైమాసికంలో కాగ్నిజెంట్ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 7.45 శాతం పెరిగి 510 కోట్ల డాలర్లకు చేరింది. ఈ ఏడాది మొత్తానికి ఆదాయ వృద్ధి అంచనాను గతంలో ప్రకటించిన 2.6–5.1 శాతం నుంచి 3.9–6.4 శాతానికి పెంచింది. 2025లో మొత్తం 2050–2,100 కోట్ల డాలర్ల రాబడి నమోదు కావచ్చని సంస్థ అంచనా వేసింది.

## ఇక 15 సెకన్లలోనే యూపీఐ చెల్లింపులు




డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా జరిపే యూపీఐ చెల్లింపుల ప్రక్రియ మరింత త్వరితం కానుంది. ప్రస్తుతం ఒక్కో యూపీఐ చెల్లింపు లావాదేవీ పూర్తయ్యేందుకు 30 సెకన్లు పడుతోంది. వచ్చే నెల 16 నుంచి ఇది 15 సెకన్లకు తగ్గనుంది. దీనికి సంబంధించి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) గురువారం స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇందుకనుగుణంగా తమ వ్యవస్థలను సిద్ధం (అప్‌డేట్) చేసుకోవాలని బ్యాంకులు, పేటీఎం, ఫోన్‌పే, గూగుల్‌పే వంటి థర్డ్ పార్టీ యాప్స్‌ను ఎన్‌పీసీఐ ఆదేశించింది. మరోవైపు చెల్లింపులు, బదిలీలు, బ్యాలెన్స్ చెక్, పిన్ మార్పు వంటి ఏపీఐ రెస్పాన్స్ టైమ్‌ను బ్యాంకులు, పేమెంట్ యాప్స్ ఇక నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలి. లేకపోతే చర్యలు తప్పవని ఎన్‌పీసీఐ హెచ్చరించింది. ఏటీఎం చార్జీల పెంపుపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆదేశాలు గురువారం నుంచి అమలులోకి వచ్చాయి. దీని ప్రకారం ఒక నెలలో ఉచితంగా విత్‌డ్రా చేసుకునేందుకు ఇచ్చిన పరిమితి దాటితే చేసే ఒక్కో లావాదేవీపై బ్యాంకులు రూ.23 చార్జీ చేయనున్నాయి. గతంలో ఈ చార్జీ రూ.21 ఉండేది. ఒక్కో లావాదేవీపై రూ.2 పెంచుకునేందుకు బ్యాంకులను అనుమతిస్తూ మార్చి 28న ఆర్‌బీఐ సర్క్యులర్ జారీ చేసింది. కస్టమర్ల ఖాతా ఉన్న బ్యాంక్ ఏటీఎంలలో ఉచిత లావాదేవీల (ఆర్థిక, ఆర్థికేతర) పరిమితి మెట్రో నగరాల్లో అయితే నెలకి మూడు కాగా నాన్ మెట్రో నగరాల్లో అయితే ఐదుగా ఉంది.

# పాక్ గగనతలం మూసివేస్తే ఎయిర్ ఇండియాకు ఎంత నష్టమో తెలుసా?




ఎయిర్ ఇండియా ఎటువంటి ప్రకటన ఇవ్వలేదు. వ్యాఖ్య కోసం చేసిన అభ్యర్థనకు భారత పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వెంటనే స్పందించలేదు. భారతదేశం– పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత ప్రభావం ఇప్పుడు భారత కంపెనీలపై స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటివరకు ఇండిగో ఎయిర్‌లైన్స్ షేర్ల పతనం గురించి చర్చ జరిగింది. ఇప్పుడు రతన్ టాటాకు ఇష్టమైన కంపెనీలలో ఒకటైన ఎయిర్ ఇండియా గురించి కూడా చర్చ జరుగుతోంది. భారత విమానయాన సంస్థలకు పాకిస్తాన్ గగనతలం ఒక సంవత్సరం పాటు మూసివేస్తే ఎయిర్ ఇండియాకు ఏటా రూ. 50,000 కోట్ల నష్టం వాటిల్లుతుంది. ఈ వాదన రాయిటర్స్ నివేదికలో చేయబడింది. ఎయిర్ ఇండియా భారత ప్రభుత్వానికి ఒక లేఖ రాసి ఈ నష్టాన్ని ప్రస్తావించిందని రాయిటర్స్ పేర్కొంది. ఈ లేఖను తాను చూశానని, చదివానని రాయిటర్స్ పేర్కొంది. పాకిస్తాన్ గగనతలంపై నిషేధం ఒక సంవత్సరం పాటు కొనసాగితే ఎయిర్ ఇండియా దాదాపు $600 మిలియన్ల (50,400 కోట్లు)పైగా అదనపు ఖర్చులను ఎదుర్కోవాల్సి ఉంటుందని రాయిటర్స్ నివేదిక ద్వారా తెలుస్తోంది. ఈ నష్టాన్ని భర్తీ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. గత వారం కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన దాడికి ప్రతీకారంగా సింధు జల ఒప్పందాన్ని భారతదేశం నిలిపివేసిన తరువాత పాకిస్తాన్ తన వైమానిక ప్రాంతాన్ని ఆ దేశ విమానయాన సంస్థలకు మూసివేసింది. ఆ తరువాత భారతీయ విమానయాన సంస్థలు అధిక ఇంధన ఖర్చులు, సుదీర్ఘ ప్రయాణాలను ఎదుర్కోవలసి ఉంటుంది. దీని కారణంగా కంపెనీలు నిర్వహణ ఖర్చులను ఎదుర్కోవలసి రావచ్చు. ఏప్రిల్ 27న ఎయిర్ ఇండియా ఆర్థిక నష్టం గురించి భారత ప్రభుత్వానికి తెలియజేసింది. ఈ నిషేధం కారణంగా విమానయాన సంస్థకు ఏడాదికి రూ. 50 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లే అవకాశం ఉందని పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు పంపిన లేఖలో ఎయిర్‌లైన్ పేర్కొంది. ప్రభావిత అంతర్జాతీయ విమానాలకు సబ్సిడీ మంచి ఎంపిక కావచ్చని లేఖలో పేర్కొన్నారు. పరిస్థితి మెరుగుపడితే సబ్సిడీని తొలగించవచ్చు. "విమానాశ్రయాల మూసివేతలు, అదనపు ఇంధన వినియోగం, అదనపు సిబ్బం ది కారణంగా ఎయిర్ ఇండియా ఎక్కువగా ప్రభావితమవుతుం ది. జు నివేదిక ప్రకారం.. ఎయిర్ ఇండియా ఎటువంటి ప్రకటన ఇవ్వలేదు. వ్యాఖ్య కోసం చేసిన అభ్యర్థనకు భారత పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వెంటనే స్పందించలేదు. భారత విమానయాన సంస్థలపై గగనతల నిషేధం ప్రభావాన్ని అంచనా వేయమని ప్రభుత్వం తన అధికారులను కోరిన త ర్వాత ఎయిర్ ఇండియా లేఖ పంపినట్లు ఈ విషయంపై ప్రత్య క్ష అవగాహన ఉన్న ఒక మూలం తెలిపింది. టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఈ విమానయాన సంస్థ ప్రభుత్వ యాజమాన్యంలో కొంతకాలం కొనసాగిన తర్వాత ఎక్కువ బిలియన్ డాలర్ల లాభాలను ఆర్జిస్తోంది. బోయింగ్, ఎయిర్‌బస్‌ల నుండి జెట్ డెలివరీలలో జాప్యం కారణంగా అభివృద్ధి ఇప్పటికే దెబ్బతింది.

# దిగివస్తోన్న బంగారం ధర



నింగికంటిన బంగారం ధరలు క్రమంగా దిగివస్తోన్నాయి. అమెరికా, చైనా మధ్య టారిఫ్ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం సహా రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ముగియనుందనే అంచనాలు పసిడి తగ్గుదలకు దోహదం చేస్తోన్నాయి. ఈ నేపథ్యంలో గురువారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.2,160 తగ్గి రూ.95,880కి దిగివచ్చింది. గుడ్‌రిటర్న్ సమాచారం ప్రకారం.. 22 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.2,000 దిగివచ్చి రూ.87,900గా పలికింది. 10 రోజుల్లో పసిడి ధర దాదాపు రూ.5వేల మేర తగ్గింది. ఇటీవల తులం బంగారం ధర రూ.1 లక్ష దాటిన విషయం తెలిసిందే. కిలో వెండిపై రూ.2,000 తగ్గి రూ.98,000గా నమోదయ్యింది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లోనూ బంగారం ధర దిగివస్తోంది. ఔన్సు ధర 3,236.94 డాలర్ల వద్ద నమోదయ్యింది. ఆల్‌టైం గరిష్ట స్థాయి 3,500 డాలర్ల నుంచి నుంచి 7 శాతం మేర తగ్గి 3,232 వద్ద పలికింది. ప్రపంచ మార్కెట్‌లో గడిచిన ఏడాది కాలంలో బంగారం ధర దాదాపు 40 శాతం పెరిగింది. అంతర్జాతీయ పరిణామాలకు తోడు డాలర్ విలువ బలపడుతుండటం కూడా పసిడి ధర తగ్గడానికి కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. ద్రవ్యోల్బణంపై ఆందోళనలు, ట్రంప్ టారిఫ్‌లు, ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు పెద్ద ఎత్తున కొనుగోళ్లు తదితర అంశాలు బంగారం ధరలకు ఆజ్యం పోశాయి. నింగికంటిన బంగారం ధరల వల్ల ఈ ఏడాది జనవరి మార్చి త్రైమాసికంలో భారత్‌లో పసిడి డిమాండ్ 15 శాతం తగ్గిందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యుజిసి) బుధవారం ఓ రిపోర్ట్‌లో వెల్లడించిన విషయం తెలిసిందే. ఆ మూడు నెలల కాలంలో బంగారం అమ్మకాలు 118.1 టన్నులకు పడిపోయాయి. పెట్టుబడుల డిమాండ్ మాత్రం 7 శాతం పెరిగి 46.7 టన్నులుగా చోటు చేసుకుంది. ఇదే సమయంలో అభరణాల డిమాండ్ ఏకంగా 25 శాతం క్షీణించి 71.4 మెట్రిక్ టన్నులకు క్షీణించింది. 2009 తర్వాత ఈ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి కావడం విశేషం.

# విమర్శకుల నోళ్లు మూయించిన రోహిత్..



"ఏమీ మారలేదు, అంతా ఒకేలా ఉంది. నా పని బ్యాటింగ్ చేయడమే. నేను కెప్టెన్‌గా ఉన్నప్పుడు కూడా, నా మొదటి పాత్ర బ్యాట్స్‌మన్‌గా, తరువాత కెప్టెన్‌గా ఉండేది. బ్యాట్స్‌మన్‌గా, నేను మ్యాచ్‌లను గెలవాలి. ఇప్పుడు నేను కెప్టెన్‌ని కానందున, నా పని జట్టుకు పరుగులు సాధించడం, మ్యాచ్‌లను గెలిపించడమే. అవసరమైన చోట నేను సహాయం చేస్తాను" అంటూ రోహిత్ చెప్పుకొచ్చాడు. ఐపీఎల్ 2025లో గురువారం ముంబై ఇండియన్స్ రాజస్థాన్ రాయల్స్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ మరో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. హాఫ సెంచరీతో అలరించాడు. అయితే, అంతకు ముందు ఫామ్‌లేమితో బాధపడ్డాడు. ఫామ్‌లో లేనప్పుడు విమర్శలు కూడా ఎదుర్కొన్నాడు. ఐపీఎల్ సీజన్‌లో 500–600 పరుగులు చేయనందుకు హిట్‌మ్యాన్‌పై కొంతమంది మాజీ క్రికెటర్లు విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో ముంబై మాజీ కెప్టెన్ విమర్శకుల నోళ్లు మూయించేందుకు ఓ కీలక ప్రకటన చేశాడు. ఈ అనుభవజ్ఞుడైన కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ తన సొంత రికార్డుల కంటే ట్రోఫీలు తనకు చాలా ముఖ్యమైనవంటూ చెప్పుకొచ్చాడు. ఎన్ని పరుగులు కావాలంటే అన్ని పరుగులు చేయవచ్చని నేను మొదటి నుంచి చెబుతూనే ఉన్నాను, కానీ వాటి విలువ జట్టు టోర్నమెంట్ గెలిచినప్పుడు మాత్రమే ఉంటుందని ఇచ్చిపడేశాడు. భారత వన్డే, టెస్ట్ కెప్టెన్ మాట్లాడుతూ, నేను 600–700 పరుగులు చేసినప్పుడు నాకు ఒక టోర్నమెంట్ ఉంటుంది. కానీ మా జట్టు టైటిల్ గెలవలేనప్పుడు అవన్నీ వృథానే అంటూ తేల్చిపారేశాడు. ఒక యూట్యూబ్ ఛానెల్‌లో రోహిత్ మాట్లాడుతూ, '2019 ప్రపంచ కప్‌లో, నేను 5 సెంచరీలు, 1 హాఫ్ సెంచరీ సహాయంతో 648 పరుగులు చేశాను. కానీ, సెమీ–ఫైనల్స్‌లో న్యూజిలాండ్ చేతిలో ఓడిపోయిన తర్వాత మేం టోర్నమెంట్ నుండి నిష్క్రమించాం. ఒకే సెషన్‌లో ఇన్ని పరుగులు సాధించడం నా లక్ష్యం కాదు. నేను గెలవాలని కోరుకుంటు న్నాను. నేను ఎల్లప్పుడూ నా ఉత్తమ ప్రదర్శన ఇవ్వాలని కోరుకుంటుంటాను' అని తెలిపాడు. ముంబై ఇండియన్స్ చరిత్రలో, ఏ బ్యాట్స్‌మన్ ఐపీఎల్ ట్రోఫీని గెలుచుకున్న ప్పుడల్లా, ఆరెంజ్ క్యాప్ గెలవలేదంటూ విమర్శకుల నోరు మూయించేలా రోహిత్ ఆన్సర్ ఇచ్చాడు. వ్యక్తిగత ప్రదర్శన ట్రోఫీగా మారదంటూ ఎత్తి చూపాడు. 'నా 30 పరుగులు జట్టు విజయానికి సహాయపడుతున్నాయని నేను చెప్పడం లేదు' అని మాజీ ఎంఐ కెప్టెన్ అన్నారు. జట్టుకు ప్రయోజనం చేకూర్చేలా ఏదైనా అందించడంపైనే నా దృష్టి ఉంటుందని చెప్పుకొచ్చాడు. ఇంతకుముందు నేను పరుగులు సాధించాలని అనుకునేవాడిని. కానీ, ఇప్పుడు అలా కాదు. ఎంఐ ట్రోఫీ గెలిచినప్పుడల్లా, మా జట్టు నుంచి ఏ ఆటగాడూ ఆరెంజ్ క్యాప్ గెలవలేకపోయాడని తెలిపాడు. దీంతో పాటు, కెప్టెన్సీని విడిచిపెట్టిన తర్వాత కూడా ఏమీ మారలేదని రోహిత్ తెలిపాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఏమీ మారలేదు, అంతా ఒకేలా ఉంది. నా పని బ్యాటింగ్ చేయడమే. నేను కెప్టెన్‌గా ఉన్నప్పుడు కూడా, నా మొదటి పాత్ర బ్యాట్స్‌మన్‌గా, తరువాత కెప్టెన్‌గా ఉండేది. బ్యాట్స్‌మన్‌గా, నేను మ్యాచ్‌లను గెలవాలి. ఇప్పుడు నేను కెప్టెన్‌ని కానందున, నా పని జట్టుకు పరుగులు సాధించడం, మ్యాచ్‌లను గెలిపించడమే. అవసరమైన చోట నేను సహాయం చేస్తాను. మా గత 3–4 సీజన్‌లు బాగా లేవు. అది మనం మార్చుకోవాల్సిన విషయం. దీని గురించి మేం మాలో వివరంగా చర్చించుకున్నాం. తప్పులు పునరావృతం కాకూడదు. మేం చాలా మంచి దశలో ఉన్నాం. ఈ సీజన్ మాకు మంచిది అవుతుంది" అని తెలిపాడు.

## భారత్‌కు మరో నాలుగు స్వర్ణాలు



ఆసియా అండర్–15, 17 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత యువ బాక్సర్లు సత్తా చాటారు. గురువారంతో ముగిసిన ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో మరో నాలుగు స్వర్ణ పతకాలు జమ అయ్యాయి. ఈ నాలుగు స్వర్ణ పతకాలు బాలికల విభాగంలోనే దక్కాయి. 46కిలోల విభాగంలో ఖుషీ చంద్ 3–2పాయింట్ల తేడాతో మంగోలియాకు చెందిన అల్టానుంజుల్‌ను చిత్తుచేసి బంగారు పతకం చేజిక్కించుకుంది. 50కిలోల విభాగంలో అహనా శర్మ, 54 కిలోల విభాగంలో జన్నత్ ఉజ్బెకిస్తాన్ బాక్సర్లను 5–0పాయింట్లతో చిత్తుచేశారు. ఇక 80కిలోలకు పైబడిన విభాగంలో అషికా జోర్డాన్‌కు చెందిన జనాను ఓడించి భారత్‌కు 15వ స్వర్ణ పతకాన్ని ఖాయం చేసింది. అలాగే అండర్–17 విభాగంలో 60కిలోల విభాగంలో సిమ్రన్‌జీత్ కౌర్, 63కిలోల విభాగంలో హర్షిక ఫైనల్లో ఓడి రజత పతకాలను దక్కించుకున్నారు. చివరిరోజు భారత్‌కు నాలుగు స్వర్ణ, రెండు రజత పతకాలతో సహా మరో ఐదు కాంస్య పతకాలు దక్కాయి. దీంతో ఈ టోర్నీలో భారత్‌కు దక్కిన పతకాల సంఖ్య 43కు చేరింది. ఈ క్రమంలోనే భారత్ పతకాల పట్టికలో 2వ స్థానంలో నిలిచింది. ఇక కజకిస్తాన్ జట్టు అగ్రస్థానంతో, ఉజ్బెకిస్తాన్ జట్టు మూడో స్థానంలో ముగించాయి.

# స్పోర్ట్స్

## చెత్త ఆటతో తేలిపోయిన చెన్నై



ఐపిఎల్‌లో కళ్లు చెదిరే రికార్డు కలిగిన చెన్నై సూపర్ కింగ్స్ (సిఎస్‌కె) సీజన్ 2025లో మాత్రం చెత్త ఆటతో అభిమానులను పూర్తిగా నిరాశ పరిచింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి సిఎస్‌కె పేలవమైన ఆటతో తేలిపోయింది. వరుస ఓటములతో ప్లేఆఫ్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ సీజన్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి ముంబై ఇండియన్స్ ఓడించి చెన్నై టైటిల్ వేటకు శ్రీకారం చుట్టింది. కానీ తర్వాతి మ్యాచుల నుంచి చెన్నై ఆట పూర్తిగా మారిపోయింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో చెత్త ప్రదర్శనతో వరుస ఓటములను చవిచూసింది. ఇతర జట్లతో పోల్చితే సిఎస్‌కె బ్యాటింగ్, బౌలింగ్ అంశాల్లో చాలా బలంగా ఉంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే బ్యాటర్లు, బౌలర్లు జట్టులో ఉన్నారు. అయినా చెన్నైకి చేదు అనుభవం తప్పలేదు. రచిన్ రవీంద్ర, రాహుల్ త్రిపాఠి, శివమ్ దూబె, రుతురాజ్ గైక్వాడ్, దీపక్ హుడా, సామ్ కరన్, మహేంద్ర సింగ్ ధోనీ, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ వంటి అగ్రశ్రేణి ఆటగాళ్లు జట్టులో ఉన్నారు. ఇంత మంది స్టార్లు జట్టుకు అందుబాటులో ఉన్నా ఫలితం లేకుండా పోయింది. ఆటగాళ్లు తమవంతు పాత్రను సమర్థంగా పోషించక పోవడం చెన్నై దుస్థితికి కారణమని చెప్పాలి. రచిన్ రవీంద్ర ఆరంభంలో బాగానే ఆడినా తర్వాత తేలిపోయాడు. కెప్టెన్ రుతురాజ్ గాయం వల్ల టోర్నమెంట్ నుంచి అర్ధాంతరంగా తప్పుకోవాల్సి వచ్చింది. ధోనీ కూడా తన మార్క్ ఆటను కనబరచలేక పోయాడు. అతను కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టినా జట్టుకు పెద్దగా ప్రయోజనం దక్కలేదు. జడేజా, అశ్విన్, దూబె తదితరులు తమ స్థాయికి తగ్గ ఆటను కనబరచలేక పోయారు. ఇక త్రిపాఠి, హుడాలు పూర్తిగా నిరాశ పరిచారు. కనీసం ఒక్క మ్యాచ్‌లో కూడా జట్టుకు అండగా నిలువలేక పోయారు. వీరి వైఫల్యం జట్టుపై బాగానే ప్రభావం చూపింది. హుడా, దీపక్‌లు చెత్త ఆటతో జట్టుకు భారంగా మారారు. ప్రపంచ శ్రేణి ఆల్‌రౌండర్ సామ్ కరన్ కూడా పూర్తిగా తేలిపోయాడు. బంతితో, బ్యాట్‌తో జట్టును ఆదుకోలేక పోయాడు. ఇలా కీలక ఆటగాళ్లందరూ తేలిపోవడంతో చెన్నై నాకౌట్ రేసు నుంచి నిష్క్రమించక తప్పలేదు.